## క్లుప్తంగా

### జూన్ 3న పోలేరమ్మ శిడిమహోత్సవం



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

**వేటపాలెం:** నాయినిపల్లిలో వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి 49 వ శిడి మహోత్సవం జూన్ 3వ తేదీన జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. శిడిమహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏడాది జరిగే శిడిమహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుండటంతో అందుకనుగుంగా ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### శింగరకొండ దర్శిని



**అద్దంకి:** క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం ఆరుద్ర నక్షత్రం తదియ తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మ నాయుడు బుధ వారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

### యోగాంధ్రపై అవగాహన



కారంచేడులో అవగాహన కల్పిస్తున్న డీఎల్‌డీఓ పద్మావతి

**కారంచేడు:** యోగాంధ్ర కార్యక్రమాలపై గ్రామ స్థాయి అధికారులతో పాటు, ప్రజలు కూడా పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని డీఎల్‌డీఓ పద్మావతి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారంచేడు ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎంపీడీఓ కె. నేతాజీ, కేఎల్ కృష్ణ, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

### హుండీ ఆదాయం రూ. 6.65 లక్షలు

**పర్చూరు(చినగంజాం):** పర్చూరులో వేంచేసి ఉన్న అద్దంకి నాంచారమ్మ అమ్మవారి 2025 వార్షిక హుండీ ఆదాయం రూ 6.65 లక్షలు అని దేవాదాయ శాఖ ఈఓ దామానాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ. 6,64,837 వచ్చినట్లు ఆయన తెలిపారు. అమ్మవారి 33 వ తిరునాళ్ల సందర్భంగా మంగళవారం ఒక్క రోజునే సుమారు రూ 4,83,000 విరాళాలు దర్శనాల రూపంలో వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుత వార్షిక ఆదాయం గత వార్షిక ఆదాయం కంటే రూ. 77 వేలు అదనంగా ఉందన్నారు.

### ఘనంగా అహల్యాబాయ్ హోల్కర్ జయంతి

**చీరాల:** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పవిత్రమూర్తి అహల్యాబాయ్ హోల్కర్ 300 జయంతిని బుధవారం పేరాలలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమానికి పట్టణ అధ్యక్షురాలు జి.భవాని అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్, వక్తగా దాసరి నారాయణస్వామి హాజరయ్యారు.1754లో కుంభేర్ కోట ముట్టడి సమయంలో భర్త మరణించడంతో ఇండోర్ పాలనా బాధ్యతలను ఆమె స్వీకరించారన్నారు. ఆమె నాయకత్వంలో ఇండోర్ ఒక సుసంపన్నమైన వ్యాపార, సైనిక కేంద్రంగా రూపుదిద్దుకుందన్నారు. గోహద్ యుద్ధాన్ని గెలిచారన్నారు. కె.రామకృష్ణ, మన్నవ సుజాత, తడవర్తి చంద్ర, బిట్రా శ్రీను, కాకర్ల వెంకటేశ్వర్లు, అరవపల్లి కుమార్, ఎస్.నాగేశ్వరావు, మేడికొండ భరణీరావు, పింజల భరణీరావు, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

### 31న జాబ్ మేళా

**చీరాల అర్బన్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఈపూరుపాలెంలోని ఎస్‌కేబీఎస్ ఎం ఐటీఐ కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 31న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ బుధవారం తెలిపారు. జాబ్ మేళాకు ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, స్కిల్ క్రాఫ్ట్, అపోలో టైర్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, రాయల్ మెరైన్, రిలైన్ ట్రాండ్స్ కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. జాబ్ మేళాకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమో వరకు చదువుకున్న 18–30 సంవత్సరాల్లోపు యువతీ యువకులు వారి పూర్తి వివరాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆయెన తెలిపారు.

# వసతులు ఉఫ్‌పాధి

పల్లె జనానికి కడుపు నిండా కూడు దొరకాలంటే వ్యవసాయ పనులే కీలకం. అయితే అన్ని కాలాల్లో ఆ పనులు ఉండవు కాబట్టి.. ఉపాధి హామీ పథకం ఎంతగానో చేయూతనిస్తుంది. కానీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో బల్లికురవ మండలంలో అపహాస్యం పాలవుతోంది. ఎండనకా, వాననకా శ్రమించే శ్రమ జీవులకు మౌలిక వసతులు కల్పించడంలో తాత్సారం జరుగుతోంది.



మస్టర్ కోసం కేవీ పాలెంలో ఎదురు చూస్తున్న కూలీలు

- ఉపాధి కూలీలకు ప్రభుత్వ శాపం
- మొన్నటి వరకు ఎండ వేడిమి.. ఉక్కపోతతో కూలీలు విలవిల
- 3 గ్రామాల్లో ముగ్గురు కూలీలు మృతి
- 21 పంచాయతీల్లో 4500 మంది కూలీలు హాజరు
- పనుల వద్ద తాగు నీరు, ప్రథమ చికిత్స, కిట్లు లేక ఇబ్బందులు
- మస్టర్లు వేయడంలో గంటల కొద్దీ జాప్యం

**బల్లికురవ:** ఉపాధి పనులు చేసే ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లను బల్లికురవ మండలంలో సమకూర్చడంలేదు. ఇప్పుడు కాస్త ఎండలు తగ్గినా మొన్నటి దాకా వేసవి ఎండలో అల్లాడిపోయారు. పనిచేసి ఇంటికి వెళ్దామన్నా మస్టర్ వేయడంలో జాప్యంతో పని ప్రదేశంలోనే గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది.

**13,477 జాబ్ కార్డులు**

మండలంలోని 21 గ్రామ పంచాయతీలు, 13 శివారు గ్రామాల్లో 13,477 మందికి జాబ్‌కార్డులున్నాయి. వేతనదారులు 24, 600 మంది వరకు ఉన్నారు. కాగా వీరిలో ప్రతి రోజూ పనులకు హాజరయ్యే కూలీలు 4400 వరకు ఉన్నారు. గ్రామాల వారీగా గుర్తించిన పనులు బోలెడున్నా పని ప్రదేశంలో వసతుల గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. గత ప్రభుత్వం హయాంలో టెంట్లు, గడ్డపార, చెలకపార, పనిముట్లు, మంచి నీరు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రభుత్వ జమానాలో అవేమీ కనబడటంలేదు. గ్రామాలకు దూరంగా కొండ, చెరువు ప్రాంతాల్లో పనులు చేయాల్సి రావడంతో అక్కడ నీరు దొరక్క కూలీలు తీవ్ర అగచాట్లకు గురవుతున్నారు.

**ప్రాణాలు పోతున్నా..**

ఎండల దృష్ట్యా కూలీలు పని చేసే ప్రదేశానికి ఉదయం 7 గంటల కల్లా పనిముట్లతో వెళ్లి 10 గంటల కల్లా ఇంటి బాట పట్టాలని అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే మస్టర్ వేయడం 11 గంటలకు ప్రారంభించటంతో ఎండ వేడిమికి పని ప్రదేశంలో ఉండలేక అస్వస్థతకు గురౌతున్నారు. కొండాయపాలెంలో శ్రీనివాసరావు ఎండవేడికి అస్వస్థతకు లోనై 10 రోజులు గుంటూరులో వైద్యశాలలో మృత్యువుతో పోరాడి చనిపోయాడు. మక్తేశ్వరంలో మాసాని మల్లిఖార్జునరావు, ఎండ దెబ్బకు అస్వస్థతకు లోనై చెట్టు కింద సేద తీరేందుకు వెళ్లి అదే చెన్నుపల్లిలో షేక్ జాన్ పనిచేస్తుండగా గుండెపోటుకు గురై చనిపోయాడు. అప్పటికి సానుభూతి తెలిపిన అధికారులు ఆ తరువాత కూడా మిగతా కూలీలకు వసతులు కల్పించకపోవడం అత్యంత శోచనీయం. మరో వైపు అలవెన్సులు.. కూలీ చెల్లింపు బ్యాంకు ఖాతాలకు జమ కావటంలో తీవ్ర జాప్యం జరుగుతోందని కూలీలు తెలిపారు.



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



చెన్నుపల్లిలో పనిచేస్తూ గుండెపోటుకు గురై చనిపోయిన షేక్ జాన్

**పనులపై కూటమి పెత్తనం**

గ్రామాల వారీగా కూటమి నేతల కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. తమకు సంబంధించిన వారికి పనులకు వెళ్లకుండానే మస్టర్లు వేయించుకుంటున్నారని కూలీలు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది. ఇక్కడ ఏపీఓ పోస్టు సంవత్సరం నుంచి ఖాళీగా ఉంది. ఈసీ, ఏపీవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పూర్తికాలపు ఏపీఓ నియమిస్తే పనులు నిత్యం పర్యవేక్షిస్తూ దొంగ మస్టర్‌లకు చెక్ పెట్టే అవకాశం ఉంటుంది. అలాగే వేతనాలు ప్రతి వారం బ్యాంకు ఖాతాలకు జమ అయ్యేలా చూడాలని కూలీలు వేడుకుంటున్నారు.

> **పనికి వెళుతున్నా మస్టర్ వేయడం లేదు**
> 20 రోజులుగా అద్దంకి మేజర్ కాలువలో ఉపాధి హామీ పథకంలో పనులు చేసేందుకు వెళ్తున్నా.. పనికి రమ్మంటున్నారు. అయితే పేరు లేదని మస్టర్ వెయ్యటం లేదు. ఇలా అయితే పూట గడిచేదెలా?
> – వీరాంజనేయులు (కూలీ, కేవీ పాలెం)



> **వసతులు కల్పించండి**
> పనులు చేసే ప్రదేశంలో వసతులు కల్పించటంతో పాటు ప్రతి వారం సొమ్ము బ్యాంకు ఖాతాకు జమ చేయాలి. ఎండ ఎక్కువగా ఉండటంతో వేసవిలో చెల్లించాల్సిన అలవెన్స్‌లు అందేలా చూడాలి.
> – గల్లా రత్తయ్య (కూలీ, కొణిదెన)



# ప్రయాణికులకు తిప్పలే..

- రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తీవ్ర అసౌకర్యం
- మూడు రోజులుగా నిలిచిన వర్షపు నీరు
- అవస్థలు పడుతున్న వాహన చోదకులు

**చినగంజాం:** ఉప్పు గుండూరు రైల్వే స్టేషన్ పరిధిలోని అండర్ బ్రిడ్జి ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. తేలిక పాటి వర్షం కురిస్తే చాలు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. అండర్ బ్రిడ్జి ఎత్తు తక్కువలో ఉండటం వర్షపు నీరు అండర్ బ్రిడ్జి కింది భాగంలో నిలిచి పోతోంది. భారీగా వర్షం కురిస్తే సుమారు 3 అడుగుల లోతు నీరు వచ్చి చేరుతోంది. దాంతో పాదచారులకు కాస్తంత ఇబ్బందిగా ఉన్నప్పటికీ వాహన దారులు మాత్రం తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. బ్రిడ్జి నుంచి ద్విచక్రవాహనదారులు రావాలంటే బెంబేలెత్తుతున్నారు. ఎలాగో ధైర్యం చేసి తమ వాహనాలను వర్షపు నీటిలో నడుపుకుంటూ వచ్చినా వర్షపు నీరు ఇంజన్‌లోకి పోయి బండ్లు మరమ్మతులకు గురవుతున్నాయి. తమ అత్యవసర పనులు నిమిత్తం బ్రిడ్జి దాటి వచ్చిన తరువాత తమ వాహనాలు మొరాయించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో రైల్వే గేటు ఉన్న సమయంలోనే నయం కొంత సేపు గేటు తెరచేంత వరకు వేచి ఉన్నప్పటికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా తమ గ్రామాలకు చేరుకునే వాళ్ళమని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మండల పరిధిలోని పెదగంజాం పంచాయతీలోని 9 గ్రామాలకు చేరుకోవాలంటే ప్రతి ఒక్కరూ ఈ రైల్వే అండర్ బ్రిడ్జి ద్వారా ఉప్పుగుండూరు గ్రామం చేరుకోవచ్చు. చినగంజాం గ్రామం నుంచి నేరుగా రొంపేరు మీదుగా పెదగంజాం గ్రామానికి చేరుకోవాలంటే రోడ్డు మార్గం ఉన్నప్పటికీ ఒంగోలు ఇతర ప్రాంతాల నుంచి పెదగంజాం పంచాయతీలోనికి ప్రవేశించాలంటే తప్పనిసరిగా ఈ మార్గం ద్వారా ప్రయాణం చేయాల్సిందే. తమ గోడును రైల్వే అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోందని వాపోతున్నారు.

**బ్రిడ్జి కింద భాగంలో రెండు అడుగుల మేర నీరు**

గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బ్రిడ్జి అడుగు భాగంలో ప్రస్తుతం సుమారు 2 అడుగుల మేర వర్షపునీరు నిలిచిపోయింది. మూడు రోజుల నుంచి నీరు నిలిచిపోవడం ఆ నీరు వెళ్లే మార్గం లేక పోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులను రైల్వే అధికారులు గుర్తించి నీటిని తొలగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి ప్రజల ఇబ్బందులను గుర్తించి బ్రిడ్జి కింద భాగంలో నిలుస్తున్న నీటిని తొలగించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బైకు ఆగిపోవడంతో నిలబడిపోయిన వాహనదారుడు

### సినిమా థియేటర్ల తనిఖీ

**చీరాల:** మండల కేంద్రం చీరాల్లోని సినిమా థియేటర్లలో తహసీల్దార్ గోపీకృష్ణ బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. మోహన్ థియేటర్‌లో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆహార పదార్థాలకు అధిక మొత్తంలో వసూళ్ళు చేస్తున్నారా.. ఫుడ్ క్వాంటిటీ ప్రకారం రేట్లు ఉన్నాయా.. లేదా, సినిమా టిక్కెట్లు ధరలు, టాయిలెట్స్ నిర్వహణను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని మిగిలిన థియేటర్లును కూడా తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ఏదైన సంఘటన జరిగితేనో, అధిక రేట్లకు సినిమా టిక్కెట్లు విక్రయించడం , అదనపు షోలు నిర్వహించడంపై రెవెన్యూ అధికారులు తరచూగా తనిఖీలు చేస్తుంటారు. అయితే ప్రస్తుతం సినిమా థియేటర్ల బంద్ వ్యవహారంపై రాష్ట్రంలో చర్చ నడుస్తున్న నేపథ్యంలో తనిఖీలు చేయడం చర్చనీయాంశమైంది.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ


## భక్తుల ఇలవేల్పు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

- 21వ వార్షిక తిరునాళ్లకు సర్వం సిద్ధం
- నేటి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభం

**మేదరమెట్ల:** మండలంలోని పమిడిపాడు గ్రామ పంచాయతీ పరిధిలో గల కష్ణంరాజువారిపాలెం (రెడ్డిపాలెం) లోని వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి క్షేత్రం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. గత 50 సంవత్సరాలుగా విశేషపూజలు అందుకుంటూ ప్రత్యేకంగా నిలుస్తోంది పుణ్యక్షేత్రం. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకురాలు నాగరాజ స్వామి ఆలయాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. ప్రతి మంగళ, ఆదివారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తుంటారు. భక్తుల విరాళాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఆలయంతో పాటు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీఅభయాంజనేయస్వామి, శ్రీనాగేశ్వర స్వామి ఆలయం, ఆరు కోణాకారంలో చుట్టూ 6పుణ్యక్షేత్రాలు (తమిళనాడులో 6 క్షేత్రాలలో ఉన్న విధంగా) 46 అడుగుల ఏకశిలద్వారా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ని ఏర్పాటు చేశారు.

**ప్రత్యేక కార్యక్రమాలు**

ప్రతి మంగళ, ఆదివారాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నాగులచవితి, నాగపంచమి, సుబ్రహ్మణ్యేశ్వరషష్ఠి వంటి ప్రత్యేక సందర్భాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ వార్షికోత్సవ వేడుకలు గత 21 సంవత్సరాల నుంచి నిరంతరంగా నిర్వహిస్తున్నారు. గురువారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని.. 31వ తేదీన స్వామివార్ల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 4.30కు రథోత్సవం, రాత్రి 8.30కు స్వామివారికి ఊయల సేవ ఉంటుందని ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.



స్వామివారి 46 అడుగుల ఏకశిలా విగ్రహం



కల్యాణం కార్యక్రమాలకు స్వామివారి అలంకరణ

## ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె

సాక్షి ఎఫెక్ట్..

**చీరాల రూరల్:** స్థానిక ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగా జంజనం కాంప్లెక్స్ (అపార్ట్‌మెంట్) వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. నిత్యం జనసంచారంతో వాహనాల రద్దీతో ఉండే ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేకపోవడం ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు బయటకు ఉండి ప్రమాదాన్ని తలపిస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ కింది భాగంలో సమీప దుకాణదారులు చెత్తా చెదారాలను డంపింగ్ చేస్తు చెత్తకుండీ మాదిరిగా తయారుచేసిన విషయాన్ని సాక్షి దినపత్రిక ఈనెల 26న ప్రచురించింది. దీనిపై విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. బుధవారం దుకాణదారులు చెత్తాచెదారాలు వేయకుండా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కిందిభాగంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను పూర్తిగా తొలగింపచేశారు. విద్యుత్ ఫ్యూజులకు బాక్స్‌లను ఏర్పాటుచేసి వాటికి రక్షణ కల్పించారు.



ఫ్యూజులకు బాక్సులు ఏర్పాటు చేసిన సిబ్బంది

## సమస్య తొలగించండి సారూ...

**మార్టూరు:** మండల కేంద్రం మార్టూరు జాతీయ రహదారి నుంచి రామ్ నగర్, నేతాజీ నగర్ కాలనీలకు వెళ్లే ప్రధాన ముఖ ద్వారం. అయితే ఆ పరిసరాల్లో నివసించే కాలనీవాసులు చెత్తాచెదారం ఇతర వ్యర్థాలను తొలగించటం కోసం పంచాయతీ అధికారులు సిమెంట్ వరలతో ఒక తొట్టి ఏర్పాటు చేశారు. కానీ గత నెల రోజులుగా పంచాయతీ సిబ్బంది ఆ తొట్టిలోని వ్యర్థాలను తొలగించకపోవడంతో స్థానికులు తమ నివాసాల్లోని వ్యర్థాలను ఆ తొట్టి పరిసరాల్లోనే వేస్తున్నారు. దీంతో రహదారి నుంచి కాలనీలలోకి వెళ్లే మార్గమంతా వ్యర్థాలు పేరుకుపోయాయి. అకాల వర్షాలతో తడిసిన వ్యర్థాల వలన సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రమంతా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. జాతీయ రహదారి పక్కన గల వ్యర్థాలు పంచాయతీ అధికారులు, సిబ్బందికి కనిపించడం లేదా అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు.



రామ్ నగర్ కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలు

## ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు విద్య

**జె.పంగులూరు:** ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు విద్య అవసరమని, వారికి ఎంతో భరోసా కల్పిస్తుందని ఎంఈఓ వీరాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని బూదవాడ గ్రామంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపులో భాగంగా బుధవారం ఇంటింటి సర్వే చేశారు. ఈ కార్యక్రమం ఈ నెల 13 వ తేదీ నుంచి జూన్ 9 వరకు ఉంటుందని తెలిపారు. 18 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి, బడి ఈడు కలిగిన పిల్లలను బడిలో చేర్పించాలని తెలిపారు. బడిలో చేరిన చిన్నారులకు ప్రభుత్వం అందించే సౌకర్యాలు, సదుపాయాలను అందించడంతో పాటు వారిలో మనోధైర్యం నింపి భావి భారత పౌరులుగా తీర్చిదిందేకు భవిత కేంద్రాలున్నాయన్నారు. ఐఈ రిసోర్స్ ఉపాధ్యాయులు పి, యెహాను, టి, అరుణ పాల్గొన్నారు.



బూదవాడలో గుర్తించిన ప్రత్యేక అవసరాలుగల పిల్లలు

## పవన సుతునికి చందనాలంకరణ

**యద్దనపూడి:** మండలంలోని పూనూరు గ్రామంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో క్షేత్రపాలకుడైన ప్రసన్నాంజనేయస్వామివారికి చందనోత్సవం పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వైశాఖమాసం సందర్భంగా గత నెలరోజులుగా స్వామివారికి ఆకుపూజలు, అర్చనలు, అభిషేకాలు, సింధూరపూజలు, హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. బుధవారం వైశాఖమాసం ముగింపు సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు చందనోత్సవం నిర్వహించి విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు దీవి భావానాచార్యులు, నారాయణం మనోజ్‌కుమార్, శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తుల గోత్రనామాలతో పూజలు జరిపించారు.



చందనాలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

## సూర్య ఘర్ సబ్సిడీ సద్వినియోగం చేసుకోండి

**చినగంజాం:** ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకానికి సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ జేఈ బోడా బీమానాయక్ సూచించారు. బుధవారం మండల వెలుగు కార్యాలయంలో సూర్యఘర్ సోలార్ పథకంపై వీఓఏలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈ మాట్లాడుతూ 2 కేవీ ఏర్పాటుకు రూ. 30 వేల నుంచి రూ. 60 వేలు, 3కేవీ ఏర్పాటుకు రూ. 75 వేలు సబ్సిడీ వస్తుందని తెలిపారు. ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ ఏర్పాటు చేసుకునే వారికి కావాల్సిన రుణసౌకర్యాన్ని బ్యాంకు ద్వారా గాని, స్త్రీనిధి ద్వారా గాని, సీఐఎఫ్ ద్వారా గాని, పొదుపు ద్వారా గాని అందిస్తామని తెలిపారు. ప్రతి సభ్యురాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీసీలు వెంకటస్వామి, శ్రీలక్ష్మి, మాధవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



వెలుగు కార్యాలయంలో మాట్లాడుతున్న జేఈ

## సిందూర్ యుద్ధ వీరునికి సత్కారం



ఆర్మీ హవల్దార్ శ్రీధర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగులు

**చినగంజాం:** ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న యుద్ధవీరునికి బుధవారం చినగంజాంలో సత్కారం నిర్వహించారు. మండలంలోని మూలగాని వారిపాలెం గ్రామానికి చెందిన ఆర్మీ హవల్దార్ పల్లెబోయిన శ్రీధర్ రెడ్డి ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని ప్రత్యేక అనుమతితో స్వస్థలానికి తిరిగి వచ్చాడు. అతనిని బాలకోటేశ్వర ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక బాలకోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఎంప్లాయీస్ అతనికి శాలువా కప్పి సత్కారం నిర్వహించారు. వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, క్రీడాకారులు రాజు రామకోటిరెడ్డి, గునివిని శ్రీనివాసరెడ్డి, కుక్కల నాగిరెడ్డి, బోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆట్లరాంబాబు, నారప రెడ్డి, కోచ్ రాజు నాయక్ పాల్గొన్నారు.

**CHANGE OF NAME**
I, CHAMALA ANJIREDDY (New Name), S/o Nagireddy, Aged 74 Years, resident of H.No.2-79, Thurupu Takkellapadu, J.Panguluru, Bapatla, A.P. 523213. DOB: 01-01-1950 I am updating my details in HDFC Life Insurance Policy with newly corrected details as mentioned above instead of old details, Name: CH ANJIREDDI & DOB: 30-11-1957

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com